ఇంకానా..

నీరు-చెట్టు బిల్లుల కోసం తప్పని నిరీక్షణ

గత తెలుగుదేశం హయాంలో నీరు-చెట్టు పథకం కింద పనులు చేసిన వారు బిల్లుల కోసం ఇంకా ఎదురుచూడక తప్పట్లేదు. 2014 నుంచి 2019 వరకు నీరు-చెట్టు కింద పనులు చేశారు. తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా ఆపేశారు. ఐదేళ్లూ అలానే గడిపేశారు. దీంతో



అప్పట్లో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలామంది చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నారు. ఇంట్లోని బంగారం తాకట్టుపెట్టి, వడ్డీ చెల్లిస్తూ.. కాలం నెట్టుకొస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బిల్లులు వెంటనే వస్తాయని కాంట్రాక్టర్లు ఆశించారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయినా ఇప్పటికీ ఆ బిల్లులకు మోక్షంలేదని వారు వాపోతున్నారు.

-ఆంధ్రజ్యోతి, హిందూపురం

గత టీడీపీ హయాంలో పనులు
రూ.కోట్లలో పెండింగ్
ఐదేళ్లూ చెల్లించని వైసీపీ ప్రభుత్వం
కూటమి పాలన వచ్చినా లభించని మోక్షం







మూడు మండలాల్లో పెండింగ్

హిందూపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రూ.4కోట్లకుపైగా బకాయిలున్నట్లు ఇరిగేషన్ అధికారుల ద్వారా తెలుస్తోంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక బిల్లుల చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయి. అప్పట్లో పనులు చేసిన కాంట్రాక్టర్లంతా తెలుగుదేశం పార్టీకి చెందినవారేనన్న ఉద్దేశంతోనే వైసీపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హిందూపురం నియోజకవర్గంలో రూ.4కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో రూ.2.5కోట్లు నీరు-చెట్టువి కాగా.. రూ.1.5కోట్లు జైక ఏపీఐఐసీబీ పథకం కింద పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నాయి. లేపాక్షి మండలంలో చేసిన కొన్ని పనులకు మాత్రం కోర్టుకెళ్లడంతో రూ.6లక్షల బిల్లులు విడుదలయ్యాయి.

టీడీపీ నాయకులు కావడంతోనే..

గత టీడీపీ హయాంలో నీరు-చెట్టు కింద పెద్దఎత్తున పనులు చేశారు. చాలామంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి, పనులు పూర్తి చేశారు. ఇంతలోనే 2019 ఎన్నికలు రావడంతో బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. ఆ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించి, అధికారం చేపట్టింది. నీరు-చెట్టు పనుల బిల్లుల చెల్లింపులను పూర్తిగా ఆపేసింది. బిల్లులు ఇవ్వాలని అధికారులు, ప్రభుత్వంపై కాంట్రాక్టర్లు ఒత్తిడి తెచ్చారు. అప్పట్లో పనులు చేసిన వారంతా టీడీపీ సానుభూతిపరులేనన్న ఉద్దేశంతో వైసీపీ పాలకులు బిల్లుల చెల్లింపును ఆపేశారు. కమిటీలు, విచారణల పేరుతో ఐదేళ్లూ కాలం వెళ్లదీశారు. అప్పులు తెచ్చి పనులు చేసిన కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు పడ్డారు. కొందరు ఆస్తులు అమ్ముకుంటే, ఇంకొందరు ఇంట్లో బంగారాన్ని విక్రయించుకున్నారు. కొంతమందికి ప్రస్తుతం బిల్లులు వచ్చినా వడ్డీలకే చాలని దుస్థితి నెలకొంది. ఇటీవల ఎన్నికల ప్రచారంలో కూటమి అధికారంలోకి రాగానే వడ్డీతో సహా బకాయిలు చెల్లిస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు వెంటనే బిల్లులు చెల్లిస్తే కొంతవరకైనా తమకు న్యాయం చేకూరుతుందని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. గత నెలలో బిల్లులు పడతాయని ప్రభుత్వ పెద్దలు చెప్పారు. అయినా ఇప్పటి వరకు జమకాకపోవడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా తాము బిల్లుల కోసం ఎదురుచూడటం ఏంటని వారు వాపోతున్నారు.

■ రూ.4కోట్లదాకా పెండింగ్

2014నుంచి 2019వరకు నీరు చెట్టు కింద రూ.2.5కోట్లదాకా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జైకా, ఏపీఐఐసీపీ కింద మరో రూ.1.5కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల లేపాక్షి, చిలమత్తూరు, పరిగి మండలాలకు సంబంధించి కొంతమేర బిల్లులు మంజూరయ్యాయి. మిగిలిన వాటిని త్వరలోనే విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పింది.

-యోగానంద్, డీఈ, ఇరిగేషన్

బుక్కపట్నం చెరువు నిర్వాసిత రైతులను ఆదుకోండి

■ అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

బుక్కపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన బుక్కపట్నం చెరువును కృష్ణా జలాలతో పూర్తిగా నింపుతుండడంతో జీవనాధారమైన భూములను కోల్పోతున్న రైతులను ప్రత్యేక దృష్టితో ఆదుకోవాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. అమరావతిలో బుధవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల జీరో అవర్‌లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడారు. 0.5 టీఎంసీ సామర్థ్యం కలిగిన బుక్కపట్నం చెరువును ఈ ఏడాది హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో పూర్తిస్థాయిలో నింపుతున్నామన్నారు. దీంతో 392మంది రైతులకు చెందిన 465 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయన్నారు. దీంతో జీవనాధారం కోల్పోయి, ఆయా రైతు కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. మానవతా దృక్పథంతో వారికి పరిహారం అందించి, ఆదుకోవాలని సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై నీటిపారుదల శాఖమంత్రి నిమ్మల రామనాయుడు మాట్లాడుతూ.. చెరువు నిర్వాసిత రైతులను తప్పకుండా ఆదుకుంటామన్నారు. జిల్లా అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుని, సకాలంలో రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకి మంత్రి హామీ ఇచ్చారు.

గురుకుల పాఠశాల భవనం నిర్మించండి

■ బీసీ సంక్షేమ మంత్రి సవితకు వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ లేఖ



ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల భవన సముదాయ నిర్మాణ పనులు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవితకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం లేఖ రాశారు. నియోజకవర్గంలో వెనుకబడిన తరగతుల విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. వీరు గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ధర్మవరానికి మంజూరైన బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించేందుకు వీలుగా భవన నిర్మాణాలు వెంటనే చేపట్టాలని మంత్రి కోరారు. అందుకు గతంలో కేటాయించిన రూ.36 కోట్లకు అదనంగా తాజా అంచనాల మేరకు నిధులు పెంచాలన్నారు. వెనుకబడిన వర్గాల పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి సత్యకుమార్ లేఖలో కోరారు.

లక్ష్యాలను అధిగమించాలి

■ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



పుట్టపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పథకాల లక్ష్యాలను సకాలంలో అధిగమించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం డ్వామా, పంచాయతీరాజ్, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ఆయా శాఖల డీఈలు పనులను పర్యవేక్షించాలన్నారు. పుట్టపర్తి, అమడగూరు, నల్లమాడ మండలాల్లో పనుల పురోగతి శూన్యమని మండిపడ్డారు. పనులను పూర్తి చేయడంలో మడకశిర, పుట్టపర్తి డివిజన్లు చాలా వెనుకబడ్డాయన్నారు. నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, పీఆర్ ఎస్ఈ మురళీకృష్ణ, పట్టుపరిశ్రమ శాఖాధికారి పద్మావతి, పశుసంవర్ధక శాఖాధికారి శుభదాసు పాల్గొన్నారు.

19 నుంచి పంటనష్టం గణన సర్వే

కొత్తచెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఈనెల 19వతేదీ నుంచి పంట నష్టం గణన సర్వే చేపట్టనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ పంట యాప్ ద్వారా వివరాలు నమోదు చేస్తారన్నారు. పంట నష్టపోయిన మండలాల వివరాలను ప్రభుత్వం వెల్లడించిందన్నారు. జిల్లాలో మూడు తీవ్ర, ఏడు పాక్షిక కరువు మండలాలను ప్రకటించిందన్నారు. ఆయా మండలాల్లో పంట నష్టపోయిన రైతుల వివరాలను రెవెన్యూ, వ్యవసాయ అధికారులు, ఆర్‌బీకే సిబ్బందితో కలిసి సేకరిస్తారన్నారు. ఈనెల 20 నుంచి 25వతేదీ వరకు పంట నష్టపోయిన రైతుల జాబితాను రూపొందించి, ఆయా రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారన్నారు. అభ్యంతరాలుంటే 28వ తేదీలోగా తెలియజేయాలని ఆయన సూచించారు.

అర్హులందరికీ ఇంటి స్థలం ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



వినతిపత్రం స్వీకరిస్తున్న రామకృష్ణ

బత్తలపల్లి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రం సమీపాన జంగం మఠం భూమిలో గుడిసెలు వేసినవారితో బుధవారం సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇళ్లు ఇప్పించే కార్యక్రమం చేపట్టామన్నారు. జంగం మఠం భూమిలో జెండాలు పాతినందుకు కొంతమంది కబ్జాదారులకు ఎనలేని కడుపు మంటగా ఉందన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇల్లులేని నిరుపేదలందరికీ ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు పట్టణాల్లో 2, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం నిర్మాణ సామగ్రి రేట్లు పెరిగినందున ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ఉచిత ఇసుక విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. అనంతరం ఆయనకు పలువురు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పాల్గొన్నారు.

కంది పంటలో మచ్చల పురుగును నివారించండి: ఏడీఏ

తాడిమర్రి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా సాగుచేసిన కంది పంటను మారుక మచ్చల పురుగు ఆశిస్తోందనీ, దీని నివారణకు మందులు పిచికారీ చేయాలని ఏడీఏ క్రిష్ణయ్య తెలిపారు. మండలంలోని నిడిగల్లు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కందిపంటను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా కందిపంటను మారుక మచ్చల పురుగు ఎక్కువగా ఆశిస్తోందన్నారు. దాని నివారణకు నోవర్డ్ మందు పిచికారీ చేయాలన్నారు. 2024-25 సీజన్‌కు సంబంధించి వేరుశనగ, వరి, టమోటా పంటలకు ప్రీమియం చెల్లించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఓ రమాదేవి, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బిందుసేద్యం పరికరాలకు రైతు వాటా కట్టించాలి

పుట్టపర్తిరూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బిందు సేద్యం పరికరాలకు రైతుల వాటా డబ్బు కట్టించాలని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్.. కోఆర్డినేటర్లను ఆదేశించారు. స్థానిక ఏపీఎంఐపీ కార్యాలయంలో బుధవారం మైనర్ ఇరిగేషన్ జిల్లా కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 30 వేల హెక్టార్లకు సంబంధించి పరికరాలను ప్రభుత్వం మంజూరు చేసిందనీ, 39 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారి వాటా డబ్బును కోఆర్డినేటర్లు కట్టించాలన్నారు. వారికి బిందుసేద్యం పరికరాలు మంజూరు చేయనున్నట్లు పీడీ వివరించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా

ఎంపీ బీకే పార్థసారథి

సోమందేపల్లి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక అక్కమ్మగార్లకొండ వద్ద నూతనంగా నిర్మించిన హరిహర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉప్పర, సగర కులస్థుల కల్యాణమండపం కోసం నిధులు ఇస్తానని హామీ ఇచ్చానన్నారు. ఈమేరకు రూ.80 లక్షలు మంజూరు చేశానన్నారు. కళ్యాణ మండపం పూర్తయ్యేందుకు అవసరమైతే మరికొన్ని నిధులను విడుదల చేస్తానన్నారు. పరిగిలో వాల్మీకి కల్యాణ మండపానికి రూ.80లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పెనుకొండ, సోమందేపల్లిలో బలిజలకు విలువైన స్థలాలను కేటాయించామన్నారు. వడ్డెర కులస్థులకు కల్యాణమండప నిర్మాణానికి రాబోవు ఆర్థిక సంవత్సరంలో నిధులు విడుదల చేస్తామన్నారు. అనంతరం ఉప్పర, సగరుల కల్యాణమండప స్థలాన్ని పరిశీలించారు. గతంలో ఈ స్థలం వివాదాస్పదంగా మారి శంకుస్థాపన కార్యక్రమం ఆగిపోయిన విషయం విదితమే. దీంతో బీకే స్వయంగా నిర్మాణానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ ధ్రువపత్రాలను వారికి అందజేశారు. అనంతరం అయ్యప్ప దేవస్థానానికి రోడ్డు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నక్కలగుట్ట కాలనీకి చెందిన ముస్లింలు మసీదు ప్రహరీ నిర్మాణం కోరుతూ ఎంపీకి వినతిపత్రం అందించారు. రాబోయే యేడాది అవసరమైన నిధులను విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప్పర సగర సంఘం అధ్యక్షుడు రామచంద్ర, టీడీపీ రాష్ట్ర ఉప్పర నగర సాధికారత సభ్యుడు బోర్వెల్ గోపాల్ పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీకే

మద్యం మత్తులో పాఠశాలకు ఉపాధ్యాయుడు

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన.. సస్పెన్షన్ వేటు

పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే దారితప్పాడు. మద్యం తాగి, పాఠశాలకు వచ్చాడు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధి బడేనాయక్ తండాలోగల ప్రాథమిక పాఠశాలలో శంకర్ నాయక్ ఎస్జీ టీచర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మద్యం తాగి పాఠశాలకు వస్తున్నాడని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఈ ఉపాధ్యాయుడి కారణంగా తమ పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ ఉపాధ్యాయుడు తమకొద్దు అని తేల్చిచెప్పారు.

సస్పెన్షన్ వేటు

పుట్టపర్తి మండలం బడేనాయక్ తండాలో ఎస్జీ టీచర్‌గా పనిచేస్తున్న శంకర్‌నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప ప్రకటనలో తెలిపారు. శంకర్ నాయక్ మద్యం తాగి, పాఠశాలకు హాజరవుతూ విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు విచారించి, ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఇదివరకే ఆయనపై పలు ఫిర్యాదులు వచ్చాయని డీఈఓ తెలిపారు. పనితీరు మార్చుకోవాలని నోటీసులు సైతం అందజేశామన్నారు. అయినా మార్పు రాకపోగా.. బుధవారం మద్యం మత్తులో పాఠశాలకు హాజరై విద్యార్థులతో గొడవ పెట్టుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. దీనిపై విచారించి, ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ వివరించారు.

న్యూస్‌బాక్స్

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు శబరి మలకు గుంతకల్లు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. కాచిగూడ-కొట్టాయం-కాచిగూడ (వయా గుత్తి) ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాచిగూడ-కొట్టాయం (నం. 07133) రైలు ఈ నెల 14, 21, 28 తేదీల్లో కాచిగూడలో మధ్యాహ్నం 3-40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6-50 గంటలకు కొట్టాయం చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07134) ఈ నెల 15, 22, 29 తేదీల్లో కొట్టాయంలో రాత్రి ఎనిమిదిన్నరకు బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 11-40 గంటలకు కాచిగూడకు చేరుతుందన్నారు. అలాగే హైదరాబాదు-కొట్టాయం (నం. 07135) రైలు (వయా గుంతకల్లు) ఈ నెల 19, 26 తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాదులో బయలుదేరి, మరుటిరోజు మధ్యాహ్నం 4-10 గంటలకు కొట్టాయం చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07136) ఈ నెల 20, 27 తేదీల్లో కొట్టాయంలో సాయంత్రం 6-10 గంటలకు బయలుదేరి మరుటిరోజు రాత్రి 11-45 గంటలకు హైదరాబాదుకు చేరుతుందన్నారు. నాందేడ్-కొల్లాం (నం 07139) ప్రత్యేక రైలు (వయా గుంతకల్లు) ఈ నెల 16న నాందేడ్‌లో ఉదయం 8-20 గంటలకు బయుదేరి మరుసటి రోజు రాత్రి పదిన్నరకు కొల్లాం చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07140) ఈనెల 18న కొల్లాంలో తెల్లవారుజాము రెండున్నరకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12 గంటలకు నాందేడ్‌కు చేరుతుందన్నారు. మౌలాలి-కొల్లాం ప్రత్యేక రైలు (నం. 07141) (వయా గుంతకల్లు) ఈనెల 23, 30 తేదీల్లో మౌలాలిలో మధ్యాహ్నం 2-45 గంటలకు బయలుదేరి, మరుసటిరోజు రాత్రి పదిన్నరకు కొల్లాం చేరుతుందన్నారు. దీని తిరుగుప్రయాణపు రైలు (నం. 07142) ఈ నెల 25, డిసెంబరు 2న కొల్లాంలో తెల్లవారుజాము రెండున్నరకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1 గంటకు మౌలాలికి చేరుతుందని వివరించారు.

గుత్తిలో చిరుత సంచారం



ఇదే.. ఆ చిరుత అంటున్నారు..

గుత్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కర్నూలు రోడ్డు మోడల్ స్కూల్ సమీపంలోని గుట్టలో మంగళవారం చిరుత సంచరించినట్లు వదంతులు వ్యాపించాయి. చిరుత సంచరిస్తోందని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్ట్ అధికారులు కొండ గుట్టలలో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే బుధవారం కూడా చిరుత కనిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో గుట్టలకు సమీపంలో ఉన్న కేపీఎస్ కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. అయితే చిరుత సంచారం వాస్తవం కాదని, పుకార్లు నమ్మవద్దని అటవీ శాఖ అధికారి మధుబాబు తెలిపారు. కొండ గట్టల్లో చిరుత సంచరించినట్లు ఎలాంటి ఆనవాలు కనిపించలేదన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయించాలి
- ఏపీటీఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

అనంతపురం విద్య, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోధనేతల పనుల నుంచి టీచర్లను మినహాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ అనేక యాప్‌ల వల్ల టీచర్లపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. త్వరలో ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. చాలా స్కూళ్లలో సిలబస్ ఇంకా పూర్తి చేయలేని దుస్థితి ఉందన్నారు. మరోవైపు అపార్ ఐడీల జనరేషన్ అంటూ ఇంకో సమస్య తీసుకొచ్చి టీచర్లపై పెట్టారన్నారు. ఇలా అనేక బోధనేతర పనుల వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందిపడే పరిస్థితులు ఉన్నాయన్నారు. 12వ పీఆర్సీని సకాలంలో అమలు చేయాలన్నారు. తక్షణం మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సతీష్, సర్దార్‌వలి, రమణ, వన్నప్ప, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, తిప్పేస్వామి, మహేష్, హిమగిరి, సుహేల్, రంగనాయకుడు, బాబ్జాన్, అలీ, అబ్దుల్ రజాక్, కలీముల్లా, వక్రుద్దీన్ పాల్గొన్నారు.

మరో ప్రపంచం



అదేమీ పారిపోదు..!
అందులో ఉన్నదీ
మాయమైపోదు..!
అయినా ఎందుకో..
ఆత్రం..!
నడుస్తున్నా..
పడుకున్నా..
కూర్చున్నా..
చూపులన్నీ దానిపైనే..!
అర్థం చేసుకోండి..
ఇది అనర్థానికి దారితీస్తుంది..!
(అనంతపురం కలెక్టరేట్ సమీపంలో బుధవారం..)

చమత్కారాల కవికాకి

ఉపాధ్యాయుడిగా ఆటపాటలతో విద్యాబోధన
కవిగా ఆర్ద్రతతో రచనలు
నేడు కవి జై సీతారాం శతజయంతి





బహుమతి అందుకున్న జైసీతారాం చిత్రించిన కార్టూన్

పెనుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆట, పాటలతో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ, కవిగా కలకాలం నిలిచే రచనలు చేశారు జై సీతారాం(కవి కాకి). చదువు చెప్పడమంటే పిల్లల్ని కొట్టడమనే అర్థం ఉన్న రోజుల్లో ప్రాథమిక ఉపాధ్యాయుడుగా తన సృజనాత్మకతతో ఆట, పాటల ద్వారా సులువుగా పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థం అయ్యేలా బోధించారు. జై సీతారాం శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండల కోగిర గ్రామంలో 1924 నవంబరు 14న ఓ నిరుపేద కుటుంబంలో జన్మించారు. స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. కుటుంబ పరిస్థితుల కారణంగా మేకల కాపరిగా పనిచేశారు. అయితే చదువుకోవాలనే కోరిక తీవ్రమై పెనుకొండకు పారిపోయి అష్టకష్టాలు పడి 8వ తరగతి వరకు చదివారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డారు.

ఆటపాటలతో బోధన

పిల్లలకెప్పుడూ వేడుక, వినోదం కావాలి, అందుకు అబినయంతో కూడిన పాటలు కావాలి. బాషే మానసిక వికాసానికి మూలమని నమ్మి పాటలు రాయడమూ, పాడటాన్ని జై సీతారాం ప్రవృత్తిగా స్వీకరించారు. అలాగే చిట్టి పొట్టి పదాలతో ఎన్నో కవితా చమత్కారాలు చేశారు. ఆయన రాసిన వందలాది బాలగేయాలు రుషి వ్యాలీ ద్వారా, వెన్నెల విందు బాలసాహిత్య అకాడమీ ద్వారా ప్రచురణ పొందాయి. పిల్లలకు బాష నేర్పడం కోసం ఆయన నిత్యం పరిశోధకులుగా సున్నా వాచకం, పది అక్షరాలతో తెలుగు లిపిలాంటి ప్రయోగాలు ఎన్నో చేశారు. పాఠాలను పాటలుగా నేర్పి పిల్లలకు చదువంటే కష్టం కాకుండా ఇష్టపడేలా చేసేవారు.

అలరించిన రచనలు

పిల్లలనే కాక నిట్టూర్పులు, మదాంద భారతం, సమతా చతుశృతి, రమ్‌సీసాలు లాంటి చందోబద్ధ రచనలతో సాహిత్యాభిమానులను ఎంతగానో అలరించారు. జై సీతారాం హృదయం పేదలు, స్త్రీలు, శ్రమజీవులు, దేశం పట్ల ఆర్ద్రంగా స్పందించేది. చెమట నీది, చేయి నీది, చేతిలోని చెమ్మనీది, మడక నీది, మానునీది, కాడిమేడి నీదిరా, కాడిమేడి పండించిన కడుపు కూడు ఏమాయెరా ? అంటూ రైతన్న బాధలను కవితాగానం చేశారు. కట్నాల వికృత స్వరూపాలపై సామాజిక రుగ్మతలపై కలం కత్తి దూశారు. ఎమర్జెన్సీలో జైలు శిక్ష అనుభవించారు. జైల్లో కూడా అరసం, విరసం, దిగంబర కవులతో జరిగిన సాహిత్య గోష్ఠులతో తన కలానికి పదును పెంచుకున్నారు. ఇంటికన్నా పదిలం ఇది రమ్మ జైలు అంటూ చమత్కార కవితాగానాలు వినిపించారు. 1983లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్నో సత్కారాలు, అవార్డులు అందుకున్నారు. కవిగానే కాక చిత్రకారుడిగా తాను రాసిన బాలల సాహిత్యం, పాటలు, పద్యాల కోసం ఆయనే స్వయంగా పెన్సిల్‌తో బొమ్మలు గీశారు. ఇంతటి అద్భుత ప్రతిభాశాలి 9 అక్టోబరు 2000లో మృతి చెందారు.

నేడు శత జయంతి వేడుకలు

జై సీతారాం శత జయంతి వేడుకలను ఆయన స్వగ్రామమైన కోగిరలో నిర్వహించనున్నారు. గ్రామంలోని జడ్పీ హైస్కూల్ నందు కవికాకి కోగిర జైసీతారాం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కోగిర జయచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజాకవి ఏలూరి ఎంగన్న, సడ్లపల్లి చిదంబర్‌రెడ్డి, డా.గోపీనాథ్, కోనాపురం ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, జాబిలి చాంద్ బాషా హాజరవుతారన్నారు.

వివాదాస్పదంగా వీఏఏల ఉద్యోగోన్నతి

అన్యాయం చేశారంటూ ఎస్సీ కేటగిరి సిబ్బంది ఆందోళన

అనంతపురం అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ)ల ఉద్యోగోన్నతి వివాదాస్పదంగా మారింది. ఉద్యోగోన్నతిలో తమకు అన్యాయం చేశారంటూ ఎస్సీ కేటగిరికి చెందిన సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. దీనిపై వారంతా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం యంత్రాంగం తర్జనభర్జనలో పడినట్లు సమాచారం. ఇదివరకే 16 మంది వీఏఏలకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాము నిబంధనల మేరకే ఉద్యోగోన్నతులు ఇచ్చామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. అయితే తమకు జరిగిన అన్యాయంపై కోర్టుకు వెళతామని ఎస్సీ కేటగిరి సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖలో 139 మంది వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు) పనిచేస్తున్నారు. ఇందులో 24 మంది గ్రేడ్ -1, 115 మంది గ్రేడ్ - 2 కింద విధులు నిర్వర్తిస్తున్నారు. మరో 26 ఏఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో 60 శాతం సీనియార్టీ, రోస్టర్ వారిగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, మిగిలిన 40 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టుల్లో 60 శాతం ఉంటే 16 మంది వీఏఏలకు ఉద్యోగోన్నతి కల్పించే ప్రక్రియ చేపట్టారు. సదరు 16 పోస్టుల్లో 3 పోస్టులు ఎస్సీ కేటగిరిలకు కేటాయించాలన్న నిబంధనల ఉన్నట్లు, 2, 7, 16 నెంబర్ల కింద తమకు పోస్టులు కేటాయించకుండా అన్యాయం చేశారని ఎస్సీ కేటగిరి సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఎస్సీ కేటగిరిలకు బదులుగా ఇతర వర్గాల వారికి ఉద్యోగోన్నతి కల్పించారని వాపోతున్నారు. ఇదేమని సంబంధిత అధికారులను అడిగితే ఇదివరకే పనిచేస్తున్న ఏఈఓల్లో 24 మంది ఎస్సీ కేటగిరిల ఉద్యోగులు ఉన్నందున 17 శాతం కోటా ఇప్పటికే పూర్తైందని సమాధానం ఇచ్చారని బాధిత సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకే పనిచేసే ఏఈఓల జాబితాతో తమకు సంబంధం లేదని, వీఏఏల నుంచి ఏఈఓల ఉద్యోగోన్నతిలో తమ కోటా మేరకు పోస్టులు కేటాయించాలని కోరుతున్నారు. గతంలో ఇష్టారాజ్యంగా రోస్టర్ పాటించడం ద్వారా తమకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగుల బాధ్యత యాజమాన్యానిదే

పోష్ చట్టంపై అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మహిళలు పనిచేసే చోట ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత యాజమాన్యాలపైనే ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక(పోష్)చట్టం-2013పై న్యాయసేవాసదన్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి, శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు హాజరయ్యారు. న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మహిళలపై తోటి ఉద్యోగులు, వారి పైఅధికారులు అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు తాము చేసే ఉద్యోగానికే పరిమితం కాకుండా లోకజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రజాసేవలందించే సంస్థల నుంచి ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించుకోవడానికి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. విద్య,వైద్యం, బీమా, బ్యాంకింగ్, రవాణా, తాగునీరు, శానిటేషన్, గృహనిర్మాణం, జాతీయ ఉపాధి హామీ, టెలికాం సేవలు వంటి ప్రజా ప్రయోజన సేవల సమస్యలలో రూ.కోటి దాకా పరిహారం ఎలాంటి ఖర్చు లేకుండా పొందే అవకాశం ఉందన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో అంతరంగిక ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో షి-బాక్సు వినియోగించి ఫిర్యాదులు చేయవచ్చని, 90రోజుల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. మహిళలు అపత్కాలంలో 181 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరికృష్ణ, పద్మజ, వన్‌స్టాప్ సెంటర్ సఖి మేనేజర్ శాంతామణి, గృహహింస నిరోధక చట్టం సోషల్ కౌన్సిలర్ ఉమాదేవి, లీగల్ కౌన్సిలర్ నర్మద, విద్యాశాఖ తరఫున శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మత్తులో మునిగాడా..?

హెచ్చెల్సీలో తేలిన మృతదేహం
స్నేహితులతో కలిసి మద్యపానం
కాలువ దాటుతూ.. కనుమరుగు

అనంతపురం క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బుడ్డప్పనగర్‌కు చెందిన ధనుంజయ(33) మృతదేహం బుధవారం హెచ్చెల్సీ నీటిలో తేలింది. అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని పావురాల గుట్ట సమీపంలో అతని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ధనుంజయ మంగళవారం సాయంత్రం హెచ్చెల్సీ నీటిలో గల్లంతయ్యాడు. మృతుడు సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం చేసేవాడు. స్నేహితులు అస్లామ్, హర్షవర్ధన్, రియాజ్‌తో కలిసి మంగళవారం ఉదయం 11గంటలకు ద్విచక్ర వాహనాల్లో బయటకు వెళ్లాడు. అందరూ కలిసి వడియంపేట సమీపంలో మద్యం సేవించారు. పావురాల గుట్ట సమీపంలోని హెచ్చెల్సీ వద్ద బ్రిడ్జిపై కూర్చుని మధ్యాహ్నం 3 గంటల సమయంలో మరోసారి మద్యం సేవించారు. నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న తన భార్యను ఇంటి వద్ద డ్రాప్ చేసి వస్తానని సాయంత్రం 5 గంటల సమయంలో అస్లాం వెళ్లిపోయాడు. మిగిలిన ముగ్గురూ అక్కడే ఉండిపోయారు. కాసేపటికి ధనుంజయ కాలువలోకి దిగి.. అవతలి గట్టుకు చేరుకున్నాడు. తిరిగి ఇటువైపు వచ్చే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో నీటి వేగానికి మునిగిపోయాడు. ఈ విషయాన్ని అతని స్నేహితులు పోలీసులకు తెలియజేశారు. నాలుగో పట్టణ ఎస్ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి వెళ్లి గాలించారు. ధనుంజయ మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. ధనుంజయ కుటుంబ సభ్యులు అతని స్నేహితులపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భార్య భువనేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతికి కారణమేమిటో తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు. ధనుంజయకు కూతురు భవిష్య, కుమారుడు కౌశిక్ ఉన్నారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న తెలుగు యువత నాయకులు

పోసానిపై ఎస్పీకి ఫిర్యాదు

అనంతపురం అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణమురళీపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నాయకులు ఎస్పీ జగదీష్‌ను కోరారు. తెలుగు యువత నాయకులు లక్ష్మీనరసింహ, నాగభూషణం, నాగరాజు, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు బండి పరశురాం బుధవారం డీపీఓలో ఎస్పీని కలిశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన పోసానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హెచ్చెల్సీ మరమ్మతుల కోసం జోలె పడతా
- జేసీ ప్రభాకర్ రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

నార్పల/పుట్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పుట్లూరు నుంచి తుంపెర డీప్‌కట్ వరకు ఉన్న హెచ్చెల్సీ మరమ్మతులకు అవసరమైన డబ్బులను జోలె పట్టి సేకరిస్తానని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. పుట్లూరు నుంచి తుంపెర డీప్ కట్‌వరకూ ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మన రాష్ట్రంలో యువతకు వ్యవసాయమే ప్రధాన ఆధారంగా మారబోతోందన్నారు. సాగు, తాగు నీరు లేకుంటే జన జీవనం కష్టం అవుతుందన్నారు. డీప్ కట్ గేట్ మరమ్మతుల కోసం రూ.మూడు లక్షలు ఖర్చు అవుతుందని, దీన్ని భరించడానికి ఏ రైతు ముందుకు రావటం లేదన్నారు. పంజాబ్ రాష్ట్రంలో రైతులు కాలువ మరమ్మతులు సొంత డబ్బులతో చేసుకుంటారని, అలాగే ఇక్కడ మన రైతులు చేసుకోవాలన్నారు. నీరు తగ్గిన తరువాత కాలువ మరమ్మతుల కోసం ప్రతి రైతు వద్దకు జోలె పట్టుకుని వస్తానన్నారు. తెలంగాణలో మహిళలు కోళ్ల ఫారాలు పెట్టుకొని డబ్బులు సంపాదిస్తున్నారని మనరాష్ట్రంలో కూడా మహిళలు కోళ్లను పెంచుకొని ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

అనంతపురం విద్య, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 20 వరకూ నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు, ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 14న బాలల దినోత్సవం, ప్రారంభ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖుల స్మరణ, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, 18న విద్యార్థులకు పలు రకాల పోటీలు, 19న మహిళలకు పోటీలు, 20న డిజిటల్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని ఆమె తెలిపారు.

కరువు మండలాల్లో పంట నష్టంపై సర్వే

అనంతపురం అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ఏడు మండలాల్లో పంటనష్టంపై సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలోని నార్పల, అనంతపురం, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల్లో రైతుల వారిగా పంటనష్టం వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈనెల 19లోగా పంటనష్టం వివరాలు నమోదు చేయాలని, 20 నుంచి 25 వరకు రైతు సేవా కేంద్రాల్లో పంటనష్టం వివరాలతో కూడిన జాబితాలు ప్రదర్శించాలని ఆదేశించారు. ఆ జాబితాపై రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వాటినిపై విచారించి, ఈనెల 28 పంటనష్టం జాబితాను విడుదల చేయనున్నారు. కరువు మండలాల్లో పంటనష్టపోయిన రైతులకు పరిహారం అందజేస్తారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 2 హెక్టార్ల వరకు ఇన్‌పుట్ సబ్సిడీ వర్తింపజేస్తారు. హెక్టారుకు వేరుశనగ, పత్తి రూ.17వేలు, మొక్కజొన్న రూ.12500, కంది, మినుము, పెసర, ఉలవ పంటలకు రూ.10వేలు, జొన్న, సజ్జ, రాగి, ఆముదం, కొర్ర రూ.8500లు పంట నష్టపరిహారాన్ని వర్తింపజేయనున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కరువు మండలాల్లో పంటనష్టం వివరాలు సేకరించాలని అధికారులను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు.

స్కూళ్లలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి
కలెక్టర్‌కు ఏపీఎస్ఈఏ నాయకుడి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విజయ్ భాస్కర్

అనంతపురం విద్య, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అపార్ జనరేషన్ కోసం స్కూళ్లలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు ఆయన బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా విద్యార్థులందరికీ అపార్ అమలు చేస్తున్నారన్నారు. అయితే అపార్ నమోదుకు విద్యార్థి పాఠశాల రికార్డులు, యూ-డైస్ వివరాలు ఒకే రకంగా ఉన్నప్పటికీ ఆధార్ కార్డులో మరోరకంగా ఉండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఆధార్‌లో మార్పుల కోసం గ్రామాల్లో తగినన్ని కేంద్రాలు లేకపోవడం వల్ల తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారన్నారు. స్కూళ్లలో 60 శాతం మంది విద్యార్థుల ఆధార్ కార్డులు సరిగ్గా లేవన్నారు. ఈ సమస్య పరిష్కారానికి స్కూళ్లలో ఆధార్ క్యాంపులు పెట్టాలని కోరారు.

జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో డీఈఓ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ సాఫ్ట్ టెన్నిస్‌పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల పులివెందులలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారుల్లో జ్ఞానేశ్వర్‌రెడ్డి, సంహిత, కిరణ్మయి ఉన్నారు. వీరు డిసెంబరులో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, ఏడీ నాగరాజు అభినందించారు.

ఉద్యోగాలకు 57మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

అనంతపురం క్లాక్‌టవర్/రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రామ్‌నగర్‌లోని నలంద డిగ్రీ కాలేజీలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈమేళాలలో యాక్సిస్‌బ్యాంకు 16మంది, సీఎస్ఆర్ అసోసియేట్స్ 18, జారికార్ట్ కంపెనీ 5, ఐఐఎఫ్ఎల్ 11, క్రెడిట్ యాక్సెస్ గ్రోమోర్‌కు ఏడుగురు మొత్తం 57మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి, నలంద కళాశాల యాజమాన్యం కేబీ చౌదరి, భువనేశ్వరప్రసాద్ సీడాప్ నారాయణస్వామి నియామకపత్రాలు అందజేశారు.

చీనీ కాయలు టన్ను రూ.33వేలు



అనంతపురం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33,190లు, కనిష్ఠంగా రూ.14వేలు, సరాసరి రూ.25వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 53 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంత్యుత్సవాలు

సీఎం చంద్రబాబు హామీ

పుట్టపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలను ప్రభుత్వాధ్వర్యంలో నిర్వహించేందుకు సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి బుధవారం వారు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఎమ్మెల్యే, రత్నాకర్ మాట్లాడుతూ.. ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించే సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల్లో పాల్గొనాలని కోరారు. వచ్చే ఏడాది నిర్వహించే శతజయంత్యుత్సవాలకు ప్రభుత్వ పరంగా నిర్వహించేందుకు సహకారం అందించాలని సీఎంను కోరారు. చంద్రబాబు మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగంతో సంప్రదించి అధికారికంగా వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పుట్టపర్తిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరగా.. ముఖ్యమంత్రి ఓకే చెప్పినట్లు వారు తెలిపారు. అనంతరం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సత్యసాయి జయంతి వేడుకలకు ఆహ్వానం కలిపారు.



సీఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రత్నాకర్

తగ్గిన టమోటా ధరలు

అనంతపురం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయాయి. మార్కెట్‌కు బుధవారం 1275 టన్నుల టమోటాలు వచ్చాయి. కిలో సరాసరి ధర రూ.15, కనిష్ఠ ధర రూ.10 పలికాయి.



ఎండిన ఆశలు..!

వరి పంటకు సుడిదోమకాటు

- వంద ఎకరాల్లో దెబ్బతిన్న పైర్లు
- లక్షల్లో ఆస్తినష్టం
- రైతుల గగ్గోలు



వెంకటగిరిపాళ్యం వద్ద తెగుళ్లతో ఎండిపోయిన వరి పంట

పెనుకొండ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వరి రైతులు రూ.వేలు పెట్టుబడి పెట్టి పంటలు సాగుచేశారు. కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. దిగుబడి కూడా ఆశాజనకంగా వచ్చే అవకాశం ఉండడంతో అన్నదాత ఆనందానికి అవధుల్లేవు. వారం, పది రోజుల్లో పంట కోయాల్సి ఉంది. దిగుబడి అమ్ముకుని, అప్పుల నుంచి కాస్త ఉపశమనం పొందుదామని రైతులు ఆశించారు. ఇంతలోనే వారి ఆశలు అడియాసలయ్యాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న పైరు కళ్ల ముందే నిలువునా ఎండిపోయింది. పంటను సుడిదోమ ఆశించింది. దీంతో పైర్లు ఎండిపోయాయి. దిగుబడి దక్కకుండా పోయింది. సర్వం నష్టపోయామని అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

సర్వం.. నష్టం..

ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని వెంకటగిరిపాళ్యం గ్రామానికి చెందిన రైతులు చెరువు కట్టకింద దాదాపు వంద ఎకరాల్లో బీపీటీ రకం వరి వంగడాన్ని సాగుచేశారు. ఎకరాకు రూ.40వేలదాకా పెట్టుబడి పెట్టారు. వారం, పది రోజుల్లో పంట కోతలు చేపట్టాల్సి ఉంది. ఈ సమయంలో పంటను సుడిదోమ వైరస్ ఆశించింది. పైరు నిలువునా ఎండిపోతోంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. చేతికందే పంట వైరస్ కారణంగా నష్టపోయామని వారు వాపోతున్నారు. పెట్టుబడి కూడా దక్కదనీ, మరిన్ని అప్పులు మూటగట్టుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు.



పెట్టుబడి కూడా కోల్పోయాం

రెండెకరాల్లో రూ.80వేలు ఖర్చుచేసి వరి సాగుచేశా. పది రోజుల్లో పంట కోయాల్సి ఉంది. సుడిదోమ దెబ్బకు పైరు రోజురోజుకీ ఎండిపోతోంది. ఏటా ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం సుడిదోమకాటు వైరస్‌తో పూర్తిగా నష్టపోతున్నాం. పెట్టుబడి కూడా దక్కదు.

- అశ్వత్థరెడ్డి, వెంకటగిరిపాళ్యం

పూర్తిగా నష్టపోయాం

మూడెకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుచేశా. ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి పెట్టా. వారం రోజుల్లో పంట కోత కోయాల్సి ఉంది. సుడిదోమ వైరస్ సోకడంతో పంటంతా ఎండిపోయి, సర్వం నష్టపోయా.

-నారాయణ, వెంకటగిరిపాళ్యం





వరికాండంలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రామసుబ్బయ్య

గాలి, వెలుతురు లేకనే.. సుడిదోమ వ్యాప్తి

వరిపైరుకు గాలి, వెలుతురు అందకనే సుడిదోమ ఆశించింది. ఎండుదశలో ఉన్న పంటకు మొదలు వరకు కాలిబాట ఏర్పాటుచేసి, పినాకులస్ ట్రూపస్, ట్రైమటోజెన్ మందులను పిచికారీ చేసుకోవాలి.

-రామసుబ్బయ్య, వ్యవసాయ శాస్త్రవేత్త

చివరి వీడ్కోలు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

> భార్య, ముగ్గురు పిల్లలతో ఆనందంగా సాగిపోతున్న కుటుంబం. భూములు లేకపోయిన ఉన్నదాంట్లోనే తృప్తిగా బతుకుతున్న ఆ కుటుంబంలోకి ఐదేళ్ల కిందట బోన్ కేన్సర్ మహమ్మారి ప్రవేశించింది. దీంతో ఆ కుటుంబం అల్లాడిపోయింది. కుమారుడికి సోకిన బోన్ కేన్సర్ చికిత్స కోసం దాచుకున్న సొమ్ముతో పాటు అందిన చోటల్లా శక్తికి మించి ఆ తండ్రి అప్పులు చేశాడు. రోగం నయం కాకపోగా అప్పులు కుప్పగా మారాయి. గొర్రెలవ్యాపారం చేసుకునే తాను దాదాపు రూ.10 లక్షల అప్పు ఎలా తీర్చేదంటూ కుంగిపోయాడు. ఈక్రమంలోనే పుట్టిన బిడ్డలను కడసారి చూసుకుని, ఈ జీవితానికి వీడ్కోలంటూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన యాడికి మండలంలోని ఓబులాపురం గ్రామంలో జరిగింది.



పండరీనాథ్ (ఫైల్)

యాడికి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓబులాపురం గ్రామానికి చెందిన పండరీనాథ్ (40) మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. యాడికి మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన పండరీనాథ్ గొర్రెల వ్యాపారం ద్వారా కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈయన కుమారుడు రాహుల్ బోన్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేయించాడు. వ్యాధి నయం కాలేదు. కుమారుడి చికిత్స కోసం సుమారు రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. అయితే చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని తరచూ బాధపడుతుండేవాడు. మంగళవారం రాత్రి తన కుమార్తె చదువుతున్న కేజీబీవీ వద్దకు వెళ్లాడు. కుమార్తెతో మాట్లాడాడు. అక్కడి నుంచి సమీపంలో ఉన్న ఈద్గా వద్ద విషద్రావకం తాగాడు. అనంతరం ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు ఈవిషయం తెలిపాడు. వారు వచ్చి పండరీనాథ్‌ను యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు. తాడిపత్రిలో చికిత్స పొందుతూ పండరీనాథ్ మృతి చెందాడు. పండరీనాథ్ భార్య మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చనిపోయిన మూడు రోజులకు పోస్టుమార్టం



జ్యోతిరబీదాస్ (ఫైల్)

గోరంట్ల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ కాలనీకి చెందిన గర్భిణి జ్యోతిరబీదాస్ (23) మృతి చెందిన మూడు రోజులకు బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌లోని దీరజ్ జిల్లా ఫతేపూర్‌కు చెందిన ఆకున్‌సాట్ కుమార్తె జ్యోతిరబీదాస్. అదే జిల్లాకు చెందిన బిస్వాస్ నాలుగేళ్లుగా గోరంట్లలో మొలల వైద్యుడిగా చికిత్సలు చేస్తున్నారు. ఆరునెలలక్రితం జ్యోతిరబీదాస్‌ను పెళ్లి చేసుకుని, రాజీవ్‌కాలనీలో నివసముంటుండేవారు. ఆమె మూడునెలల గర్భిణి. ఈనెల 10న బాత్‌రూమ్‌లో పడిందని గోరంట్ల ఆస్పత్రికి తీసుకొచ్చారు. అనంతరం హిందూపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందిన విషయం తెలిసిందే. హిందూపురం ఆసుపత్రి వైద్యులు పరీక్షించి, అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు భావించి, పోలీసులకు సమాచారం అందించారు. పురం మార్చురీలో ఆమె దేహాన్ని ఉంచారు. ఆమె తల్లిదండ్రులకోసం ఎదురుచూసినా వారు రాలేదు. దీంతో సీఐ శేఖర్, తహసీల్దార్ మారుతి ఆధ్వర్యంలో ఆమె మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపడతామని సీఐ తెలిపారు.

రివర్స్ చేస్తుండగా బావిలో పడ్డ ఆటో



అదుపుతప్పి బావిలో పడ్డ ఆటో, స్వల్పంగా గాయపడ్డ డ్రైవర్ మల్లి

యాడికి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రివర్స్ చేసుకుంటుండగా ఆటో అదుపు తప్పి బావిలో పడిన సంఘటన కొట్టాలపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ మల్లి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు యాడికి గ్రామానికి చెందిన మల్లి నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కొట్టాలపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇంటినిర్మాణం కోసం ఆటోలో ఇనుపకడ్డీలను యాడికి నుంచి తీసుకు వెళ్లాడు. కడ్డీలను దింపి ఆటోను రివర్స్ చేసుకుంటుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న బావిలో పడింది. అయితే ఆటోడ్రైవర్ మల్లి చాకచాక్యంగా అందులోంచి దూకేశాడు. స్వల్పంగా గాయపడిన మల్లిని యాడికిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కోర్టు ద్వారా ఇల్లు చేరిన తల్లి

- బాగా చూసుకోవాలి: న్యాయాధికారి



వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పజెబుతున్న కోర్టు సిబ్బంది

కదిరి లీగల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కన్నకొడుకు బస్టాండులో వదిలేసిన తల్లి కథ సుఖాంతమై ఇల్లు చేరింది. కోర్టు ద్వారా ఆ తల్లిని కుటుంబ సభ్యులకు బుధవారం అప్పగించారు. 75 ఏళ్ల వృద్ధురాలు భూక్యా లక్ష్మీబాయిని ఈనెల 9న సోమందేపల్లి బస్టాండులో కుటుంబ సభ్యులు వదిలి వెళ్లిన విషయం విదితమే. అన్నం తీసుకొస్తానని చెప్పి కుమారుడు.. ఆ తల్లిని వదిలేసి వెళ్లాడు. ఆటోడ్రైవర్ హరి ద్వారా వెలుగుచూసిన ఈ ఘటన సర్వత్రా చర్చనీయాంశమైంది. సోమందేపల్లి ఎస్ఐ రమేష్‌బాబు.. వృద్ధురాలి వివరాలను తెలుసుకున్నారు. అమడుగూరులో నిర్వహిస్తున్న శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఈ విషయంపై జిల్లా న్యాయాధికారులు కూడా స్పందించారు. వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి.. కదిరి మండలం న్యాయాధికార సేవా సంస్థ చైర్మన్‌కు లేఖ రాశారు. అప్పటికే తన రెండో కుమారుడు గణపతినాయక్, అల్లుడు శ్రీనివాస్‌నాయక్, కూతురు ప్రమీలాబాయి, కోడలు వరలక్ష్మీబాయి.. వృద్ధురాలిని తీసుకెళ్లడానికి ముందుకొచ్చారు.న్యాయాధికారుల ఆదేశాలు, వృద్ధాశ్రమ నిర్వాహకుల వినతితో వృద్ధురాలిని బుధవారం న్యాయాధికారి జయలక్ష్మీ ఎదుట హాజరు పరిచారు. కుటుంబసభ్యులను న్యాయాధికారి మందలించడమే కాక ఆమె యోగక్షేమాలను బాగా చూసుకోవాలని సూచించారు. నలుగురు పిల్లలు కలిసి తల్లిని పోషించలేరా అని మండిపడ్డారు. 'రోడ్డుపై వదిలేసి పోతారా.. మానవత్వం ఉందా' అంటూ మందలించారు. బాగా చూసుకుంటామని కొడుకు గణపతినాయక్, అల్లుడు శ్రీనివాస్‌నాయక్ అంగీకార పత్రాన్ని కూడా కోర్టుకు ఇచ్చారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని న్యాయాధికారి హెచ్చరించారు. అనంతరం వృద్ధురాలు లక్ష్మీబాయిని కుటుంబ సభ్యులు సొంతూరు కొత్తచెరువు మండలం కొడపగానిపల్లికి తీసుకెళ్లారు.

రిజర్వాయరుకు 878 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 878 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బుధవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో ప్రస్తుతం 878 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 982 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.581 టీఎంసీల నీరు నిల్వ వున్నట్లు తెలిపారు.

వైభవంగా తెప్పోత్సవం



శింగనమల చెరువులో వేడుక



శింగనమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరంగరాయ చెరువులో బుధవారం రాత్రి గ్రామ దేవతల తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శింగనమల చెరువులో ప్రతి ఏటా కార్తీక మాసంలో తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. గ్రామదేవతలు ఆత్మాసీతారాములు, గోల్కొండ వెంకటరమణ భూదేవి, పార్వతీపరమేశ్వరులు, నగరేశ్వరి అమ్మవారు, దుర్గాంజనేయస్వామి విగ్రహాలను మత్స్యకారులు ఏర్పాటు చేసిన పెద్ద తెప్పపై ఆసీనులను గావించారు. ప్రత్యేక అలంకరణలు, విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న ఈ తెప్పను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి కుటుంబసభ్యులు గంగపూజ చేశారు.

మాకూ ఉద్యోగం ఇవ్వండి

జిల్లా వ్యవసాయ అధికారికి ఎంపీఈఓల వినతి

అనంతపురం అర్బన్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): తమకు తిరిగి జిల్లాలో ఎంపీఈఓలుగా ఉద్యోగ అవకాశం కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మకు పలువురు బాధిత ఎంపీఈఓలు విన్నవించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు బాధిత ఎంపీఈఓలు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆమెను కలిసి తమ గోడుకు వెల్లబోసుకున్నారు. వైసీపీ పాలనలో అవసరం లేకపోయినా తమను ఓడీపై చిత్తూరు జిల్లాకు పంపారని, పలు కారణాలతో కొందరు ఉమ్మడి చిత్తూరులో ఉద్యోగం చేయకపోవడంతో అప్‌స్కాండ్‌లో ఉన్నట్లు చూపారని, మరికొందరికి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు నోటీసులు ఇచ్చారన్నారు. వాస్తవంగా కొందరికి ఓడీపై చిత్తూరుకు వెళ్లాలని ఉత్తర్వులు కూడా ఇవ్వలేదని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.

చిత్తూరులో పనిచేస్తున్న సమయంలో మెటర్నిటీ సెలవుల్లో వెళ్లిన కొందరిని తిరిగి అక్కడి అధికారులు ఉద్యోగంలో చేర్చుకోలేదన్నారు. వ్యవసాయ శాఖలో సిబ్బంది క్రమబద్ధీకరణ నేపథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనైనా ఉద్యోగాలు కోల్పోయిన తమకు తిరిగి జిల్లాలో ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్పందిస్తూ ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓల ఓడీలు రద్దు చేసిన నేపథ్యంలో వారికి మాత్రమే జిల్లాలో తిరిగి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు. మీ సమస్యను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని, తన పరిధిలోని ఏమి లేదని స్పష్టం చేశారు.

జోరుగా జూదం

ధర్మవరం డివిజన్‌లో యథేచ్ఛగా నిర్వహణ

- రహస్య స్థావరాలు ఏర్పాటు చేసుకుని పేకాట
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- ఇన్ఫార్మర్ల సాయంతో తప్పించుకుంటున్న వైనం

ధర్మవరం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జూదం విచ్చలవిడిగా సాగుతోందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చాపకింద నీరులా రోజురోజుకీ విస్తరిస్తూ పోలీసులకు సవాల్‌గా మారుతోంది. జూదకేంద్రాల్లో రోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పేకాట నిర్వాహకులు తరచూ స్థావరాలను మార్చుతూ గోప్యంగా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జూదరులు వస్తున్నట్లు తెలుస్తోంది. వారికి పేకాట నిర్వాహకులు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తూ కేంద్రాలకు రప్పిస్తున్నారు. ఎప్పటికప్పుడు స్థావరాలను మార్చుతూ ఆ సమాచారాన్ని ఫోన్ ద్వారా జూదరులకు తెలియజేస్తూ అవసరమైతే లోకేషన్ కూడా షేర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో జూదరులు స్థావరాలకు సులభంగా చేరుకుంటున్నారు. పోలీసులు ఎంత రహస్యంగా పక్కా సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నా.. ఇన్ఫార్ల ద్వారా తెలుసుకుని జూదగాళ్లు తప్పించుకుంటున్నారు.



ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నారంటే..

ధర్మవరం పోలీసు సబ్ డివిజన్ పరిధి పట్టణ శివారు ప్రాంతాలతోపాటు పలు మండలాల్లో జూదం జోరుగా సాగుతోంది. పట్టణంలోని పలు లాడ్జిల్లో కూడా జూదం సాగుతున్నట్లు సమాచారం. ధర్మవరం రూరల్, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో జూదం జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు దళారులను ఇన్ఫార్మర్లుగా ఏర్పాటుచేసుకుని, నిర్వాహకులు పేకాట ఆడిస్తున్నట్లు సమాచారం. రెండు, మూడు చోట్ల ఇన్ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటున్నారట. పోలీసులు దాడులకు బయల్దేరినా.. ఇన్ఫార్మర్లు రహస్యంగా సమాచారాన్ని చేరవేస్తుండటంతో జూదరులు తప్పించుకుంటున్నారు. దీంతో రోజూ ఆయా ప్రాంతాల్లో స్థావరాలను మార్చుతూ జూదాన్ని కొనసాగిస్తున్నట్లు సమాచారం.

వైసీపీ పాలనలో విచ్చలవిడి

వైసీపీ ఐదేళ్ల పాలనలో సబ్ డివిజన్ పరిధిలో జూద కేంద్రాలు విచ్చలవిడిగా నిర్వహించారన్నది బహిరంగ రహస్యమే. ఆ పార్టీ నేతల కనుసన్నల్లో కొనసాగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో విచ్చలవిడిగా జూదం సాగింది. తద్వారా అక్రమార్జనను రుచిచూసిన నిర్వాహకులు ప్రస్తుతం కూడా పలు చోట్ల కేంద్రాలను నడుపుతున్నట్లు తెలుస్తోంది. వీటి నిర్వహణలో పలుచోట్ల కొందరు పోలీసు సిబ్బంది.. వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పేకాట జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

దాడులు చేస్తున్నా ఆగని జూదం

కూటమి అధికారంలోకి వచ్చాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపట్టింది. పోలీసులు కూడా జూదాన్ని పూర్తిగా నియంత్రించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ఇప్పటికే ధర్మవరం పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని పలుప్రాంతాల్లో దాడులు నిర్వహించి, జూదరులను పట్టుకున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం ధర్మవరం పట్టణంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న వైసీపీకి చెందిన 10 మంది జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.59,100 స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరంరూరల్ ప్రాంతంలో రాంపురం, సీతారాంపల్లి, తనకంటివారిపల్లి శివార్లు, చెన్నేకొత్తపల్లి మండలంలోని ప్యాదిండి, ఎన్ఎస్ గేటు, మేడాపురం పరిసరాల్లో జూదకేంద్రాలపై పోలీసులు దాడులు చేసి, కేసులు కట్టారు. ముదిగుబ్బ మండలంలోని టీఎన్‌పాళ్యం, దొరిగిల్లు ఘాట్‌రోడ్డు, ముదిగుబ్బ గ్రామ శివారు, నల్లచెర్లోపల్లి, కనగానపల్లి మండలంలోని దాదులూరు, వేపకుంట, మద్దలచెరువు, తగరకుంట, తాడిమర్రి మండలంలో తురకవారిపల్లి, దాడితోట, బత్తలపల్లి మండలంలో డి.చెర్లోపల్లి, పత్యాపురం ప్రాంతాల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తుంటారు. వీటిపై కూడా పోలీసులు దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేస్తున్నారు.

పేకాటపై కఠిన చర్యలు తీసుకుంటాం



ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో పేకాట ఆడినా, ఆడించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేస్తున్నాం. రెండోసారి ఎవరైనా దొరికిన నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపుతాం. -శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం

న్యూస్ బాక్స్...

'అపార్' ప్రక్రియలో సమస్యలు తొలగించండి

పుట్టపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ తరహాలో అపార్ కార్డు అందించడంలో సమస్యలు వెంటనే తొలగించి.. పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ టీఎస్‌చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓ, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం.. ఒకే ఐడీ కార్డు తరహాలో విద్యార్థులకు అపార్ కార్డుల ఐడీలను అందిస్తోందన్నారు. అపార్ గుర్తింపు కార్డులను అందించే విషయంలో విధి విధానాలను కలెక్టర్ వివరించారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

టీడీపీతోనే ముస్లింలకు న్యాయం

కదిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రంలోని ముస్లిం, మైనార్టీలకు న్యాయం జరుగుతుందని మైనార్టీ రాష్ట్ర నాయకురాలు ఫర్వీనాభాను బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం నారా చంద్రబాబునాయుడు మైనార్టీలకు సాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ పాలనలో కర్నూల్ జిల్లాలో ఓ మైనర్ బాలికపై అత్యాచారం, హత్యకు గురికాగా... ఆ కుటుంబానికి నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.పది లక్షలు అందచేశారన్నారు. పుంగనూరులో మిస్బ కుటుంబానికి రూ.పది లక్షలు, అనంతపురం జిల్లాలో అబ్దులా భార్యకు, చీరాల అమీన్ ఆర్ఫీ కుటుంబంలో ఒక్కొక్కరికి ఉద్యోగం ఇవ్వడం హర్షణీయ మన్నారు. ఇమామ్‌లు, మౌజన్లకు, పాస్టర్లకు ప్రోత్సహకాలు ఇస్తున్నారన్నారు. చంద్రన్న విద్యాపథకంలో భాగంగా 550 మంది వలంటీర్లను తిరిగి నియమించడం, 258 మంది ఉర్దూ ఉపాధ్యాయుల నియామకం తదితర కార్యక్రమాలు చేపట్టిన చంద్రబాబుకు ఎంతో రుణపడి ఉన్నామన్నారు. బడ్జెట్‌లో మైనార్టీలకు అత్యధిక నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ధర్మవరం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ధర్మవరం శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఈ మేరకు బుధవారం గ్రంథాలయంలో కరపత్రాలను పాఠకులతో కలిసి విడుదల చేసిన ఆమె మాట్లాడారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులు గురించి, 17న కవి సమ్మేళనం, 18న చిత్రలేఖనం, 19న ఉమెన్స్ డే, 20న వారోత్సవాల ముగింపు సంబరాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది నాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు పూర్తి చేయాలి

ధర్మవరం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోన్నతులను వెంటనే పూర్తి చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీ.ఏ, ఆర్జిత సెలవులు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులపై బోధనేతర భారం తగ్గించాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షుడు జిన్నెనాగప్ప, ఉపాధ్యాయులు బషీర్, అహమ్మద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పుట్టపర్తి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌వీ జానకీరామయ్య పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు గ్యాస్ వినియోగంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూప్ చర్చలు, వినియోగం, వ్యక్తిగత ప్రశ్నలకు విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఉత్తమ సమాధానాలు ఇచ్చిన విద్యార్థులకు ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు రాజీవ్ బహుమతులు అందించారు.

16న ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ

పుట్టపర్తిరూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో శనివారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బేకరి గంగాధర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేట్ భవనంలో ఆయన మాట్లాడుతూ... ఈ సభను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, విద్యావంతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపినిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్డీడీ నరసింహులు, పైపల్లి నరసింహులు, పోటోసాయి, వెంకటరాముడు పాల్గొన్నారు.

● ధర్మవరం: అనంతపురంలో శనివారం ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక జగ్జీవన్‌రాంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ... అధిక సంఖ్యలో మాదిగలు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఎమార్పీఎస్ ధర్మవరం ఇన్‌చార్జ్ బూదెప్ప, నాయకులు బండారు రామాంజినేయులు, గజ్జలరామాంజి, నారాయణ, ఎంఈఎఫ్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐని నియమించండి



గాండ్లపెంట పోలీస్‌స్టేషన్

గాండ్లపెంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ క్రిష్ణవేణి గతనెల 25న తాడిమర్రికి బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడ ఎస్ఐ పోస్ట్ ఖాళీగా ఉంది. ఉన్నతాధికారులు ఎస్ఐని నియమించలేదు. పలు సమస్యలపైన పోలీస్‌స్టేషన్‌కు వస్తే ఎస్ఐ లేకపోవడంతో అవి పరిష్కారం కావడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

గుంతలరోడ్లకు మోక్షం

ధర్మవరంరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రధాన రహదారులన్నీ గుంతలమయమై ఇబ్బందికరంగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుంతల రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ధర్మవరంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట, పోతుకుంట అండర్‌బ్రిడ్జి, మార్కెట్‌యార్డు వద్ద, షిర్డీసాయిబాబా టెంపుల్‌సమీపంలో, ఎర్రగుంట సర్కిల్ సమీపంలో ఉన్న గుంతల రోడ్లుకు తారు వేసి పూడ్చి వేసే పనులను సిబ్బంది చేపట్టారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది →



పాలకులకు పట్టదా..?

◆ సర్వసభ్య సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీల డుమ్మా

◆ వైసీపీ మద్దతుదారులు కావడంతో నిర్లక్ష్యం



ఖాళీగా ఉన్న కుర్చీలు

ధర్మవరంరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పట్ల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన వీళ్లు.. ఏకంగా ఆ సమావేశానికే డుమ్మా కొట్టారు. మండలంలో మొత్తం 20 మంది సర్పంచ్‌లు ఉండగా.. అందులో 19 మంది వైసీపీ మద్దతుదారులే. ఇక ఉన్న 13 మంది ఎంపీటీసీలూ ఆ పార్టీ మద్దతుదారులే. ప్రతి మూడు నెలలకొకసారి ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంది. ఈ ప్రభుత్వం తమది కాదులే.. ఇక ప్రజలు ఎలా పోతే మాకేంటి అన్న రీతిలో వీరు వ్యవహరిస్తున్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గిరక రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి 20 మంది సర్పంచ్‌లకు గాను పది మంది, 13 మంది ఎంపీటీసీలకు గాను ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. వీరు కూడా సమావేశంలో ప్రజాసమస్యలను ఏ మాత్రం లేవనెత్తలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే తాగునీటి సమస్యలు, సీసీరోడ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇలాంటి సమయంలో గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు .. ఆ సమావేశానికే డుమ్మా కొట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీఓ సాయిమనోహర్ మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా సమావేశాలకు రావాలని తెలిపారు.

ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల విషయంపై గ్రామస్థులతో చర్చిస్తున్న జిల్లా అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తనకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిరెడ్డిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాన్ని గ్రామస్థులతో కలిసి జిల్లా వైద్యాధికారులు బుధవారం పరిశీలించారు. పంచాయతీ కేంద్రాలైన మల్లిరెడ్డిపల్లి, ముండ్లవారిపల్లి, కోటపల్లి, గేమేనాయక్‌తండాలో ఆస్పత్రులు లేవు. దీనిపై ఈ నెల 10న ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కలేనా..? అన్న పేరుతో ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. మల్లిరెడ్డిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాన్ని గుర్తించడానికి ఆ గ్రామస్థులతో కలిసి పర్యటించారు. నివేదికలు ఉన్నతాధి కారులకు పంపుతామన్నారు. ఇందులో ఏపీహెచ్‌ఈఓ ఓబులేసు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట రమణనాయక్, బ్రహ్మానందరెడ్డి ఉన్నారు.



కరాటేలో రాణిస్తున్న కదిరి విద్యార్థులు

కదిరి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కరాటే పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటారు. వీరిలో వర్షిత, నాగవర్షిత, దీపిక, షమీరారెడ్డి, రాహుల్, నూర్‌మహమ్మద్ మొదటి స్థానంలో, ప్రజ్ఞాష్, సోనిబాయి, పునీత్ రెండో స్థానంలో నిలిచారు. అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కరాటే మాస్టార్ షేక్షా తెలిపారు.

క్రీడల్లో బుక్కపట్నం విద్యార్థుల సత్తా



బుక్కపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి క్రీడల్లో సత్తా చాటిన మండల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుక్కపట్నం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు లోకేష్, ప్రశాంత్ అండర్ 19 హాకీ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 16 నుంచి 18 వరకు కాకినాడలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. అలాగే ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల్ బ్యాట్మింటన్ పోటీల్లో బాబావలీ నాల్గో స్థానంలో నిలిచారు. వీరిని హెచ్‌ఎం జగదీష్, పీడీ నాగరాజు అభినందించారు.

అభివృద్ధిపై సమీక్ష

ముదిగుబ్బ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పంచా యతీ గ్రామాల అభివృద్ధిపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ.... గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ముదిగుబ్బ మండల పరిషత్ కార్యాలయంలో రికార్డుపరంగా తెలియజేస్తే వాటిని జిల్లా కేంద్రానికి పంపుతామన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళిక, ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులు, చేయాల్సిన పనుల వివరాలను తెలియజేయాలన్నారు. 2024-25కు సంబంధించి గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ విజయ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి మంజుల పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ అభివృద్ధిపై మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, డిజిటల్ సహాయకులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాబర్టు విల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిలో అన్ని శాఖల ద్వారా వనరుల సమీకరణ చేసి, ఆయా శాఖల ద్వారా ఏఏ పనులు చేస్తే అభివృద్ధి చెందుతుందో అనే ప్రణాళికలు తయారీపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండల, గ్రామ సమాఖ్య సంఘం లీడర్లు పాల్గొన్నారు.

● నేడు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ: పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ, ఈఓఆర్డీ తెలిపారు.

● నల్లమాడ: మండలంలోని పంచాయతీ గ్రామాల్లో అభివృద్ధి పనులను గుర్తించాలని సీనియర్ అసిస్టెంట్ లోకా మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 నిధుల రాకకోసం పనులు గుర్తించాలని, అలా గుర్తించిన పనులకు నిధులు మంజూరవుతున్నాయని అన్నారు.

బ్యాంక్ ఖాతాకు లింక్ తప్పనిసరి

కదిరి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఖాతాకు ఎన్ పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింక్ తప్పనిసరి అని ఎంపీడీఓ పోలప్ప ఓ ప్రకటనలో సూచించారు. సంక్షమ పథకాలకు సంబంధించి, ఎన్‌పీసీఐ లింక్ ఉన్న ఖాతాల లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వారికి పథకాలు అందకుండా పోతాయన్నారు. దీన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీసీఐ లింక్ తప్పని సరి చేసిందన్నారు.

● నల్లమాడ : బ్యాంక్ ఖాతాకు ఎన్ పీసీఐ లింక్ తప్పని సరి అని ఇన్‌చార్జీ ఎంపీడీఓ రాబర్టు విల్సన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్షేమపథకాల లబ్ధిదారులు ఖాతాలకు ఎన్‌పీసీఐ తప్పకుండా లింక్ చేసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన

తనకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఎస్ఐ గోపీ వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఫోక్సో చట్టం, ఎన్‌డీపీఎస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్ ..

కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్టపర్తిరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడపల్లిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. బ్రాహ్మణపల్లి ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. అతని నుంచి 20 టెట్రాప్యాకెట్ల స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ మనోహర్‌రాజు, ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్ సునంద, ఎస్ఐ సత్యన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు ఇసుక టిప్పర్లు సీజ్

బత్తలపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరశనపల్లి, ఓబుళాపురం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను బుధవారం సీజ్ చేసినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. గరశనపల్లి సమీపం నుంచి రెండు టిప్పర్లు, ఓబుళాపురం నుంచి ఒక టిప్పర్‌లో ఎటువంటి అనుమతులూ లేకుండా ఇసుక తరలిస్తున్న వాటిని వేల్పుమడుగు క్రాస్ వద్ద స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

● ముదిగుబ్బ: మండలంలో ఉప్పలపాడు నుంచి నల్లమాడకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ముదిగుబ్బలో బుధవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ నారాయణస్వామి తెలిపారు. ఆ ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

కదిరి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. కదిరి పట్టణంలోని ఓ కళాశాలలతో చదువుతోంది. శనివారం ఆ కళాశాలకు వచ్చిన ఆ బాలిక తిరిగి ఇంటికి వెళ్లలేదు. బంధువులు, స్నేహితుల వద్ద కుటుంబ సభ్యులు విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో బుధవారం బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

మట్టి తొలగింపు



రోడ్డుపక్కన పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

ఓబుళదేవరచెరువు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కదిరి, హిందూపురం ప్రధాన రహదారికి ఇరువైపులా మట్టి పేరుకుపో వడంతో రోడ్డు విస్తీర్ణం తగ్గి.. పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి దృష్టి సారించారు. బుధవారం రోడ్డు పక్కన పేరుకుపోయిన మట్టిని తొలగించేలా చర్యలు చేపట్టారు. వృథా మట్టిని గ్రామ కార్యదర్శి మల్లికార్జున సిబ్బంది ద్వారా ట్రాక్టర్‌తో తరలించారు.

విద్యార్థుల అల్పాహారానికి విరాళం

ధర్మవరం: పట్టణంలోని బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారానికి దాతలు రూ.10,500 విరాళాన్ని ఆ పాఠశాల హెచ్‌ఎం ఉమాపతికి బుధవారం అందజేశారు. పాఠశాలలో ప్రత్యేక శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు సాయంత్రం సమయాల్లో అల్పా హారాన్ని అందించేందుకు ఈ విరాళం ఇచ్చామని దాతలు బాబావలి, హరీశ్, ఉట్టిశివప్రసాద్, చౌడయ్య, హేమరాజ్, వెంకటనారాయణ, శివ తెలిపారు.

బూదిలి ఉన్నతపాఠశాల పేరుమార్పు

గోరంట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలిజిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను ఇంకనుంచి శ్రీశైల నిడిమామిడి జగద్గురు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలగా పరిగణించాలని ఎంఈఓలు జాన్‌రెడ్డెప్ప, గోపాల్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్టప్ప ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ట్రస్టు అందించిన సేవల కారణంగా గతంలో ఈ పేరుతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్లు రికార్డులున్నాయని, అయితే ఇటీవల కాలంలో బూదిలి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలగా వాడుకలోకి వచ్చిందన్నారు. బూదిలి బసవేశ్వర సేవా సంఘం అభ్యర్థన మేరకు పాత పేరును పునద్ధరిస్తూ డిఈఓ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఉత్తర్వుల ప్రతిని ఎంఈఓ గోపాల్, బూదిలి హెచ్ఎం వెంకటేశ్వర్లుకు అందచేశారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టిన ఎంపీ



ఆల్విన్ కాలనీలో రోడ్డు మరమ్మతు చేస్తున్న దృశ్యం

పెనుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ఆల్విన్ కాలనీలో కేబుల్ వైరు కోసం రోడ్లు తవ్వి గుంతలు మూయకుండా వదిలేయడంతో కాలనీవాసులు విషయాన్ని ఎంపీ పార్థసారథి దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన స్పందించి సొంత నిధులతో ఎక్స్‌కవేటర్ ఏర్పాటుచేసి రోడ్డుపై గుంతలను పూడ్చించారు. రోడ్డుపక్కన ఉన్న ముళ్లచెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయించారు. విస్తరణ పనులు చేసిన ఎంపీని కాలనీవాసులు అభినందించారు. రోడ్డుమరమ్మతు పనులను నాయకులు జావిద్, హరీ, తదితరులు పరిశీలించారు.

మండల సమావేశంలో ప్రొటోకాల్ వివాదం

గోరంట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ప్రొటోకాల్ పాటించలేదని టీడీపీ మండల కార్యదర్శి, మలసముద్రం సర్పంచ్ భర్త అశ్వర్థరెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై మండల కార్యవర్గసభ్యులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసమావేశం ప్రారంభం కాగానే వేదికపై ఉన్న ఫ్లెక్సీలో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలతోపాటు మంత్రి సవిత ఫొటోవేశారని, ప్రొటోకాల్‌ప్రకారం ఎంపీ పార్థసారథి ఫోటో ఎందుకు వేయలేదని ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఇఓఆర్‌డి శివన్నలను అశ్వర్థరెడ్డి ప్రశ్నించారు. తమకు ఎలాంటి ఉద్దేశ్యం లేదని, పొరపాటు జరిగిందంటూ ఎంపీడీఓ ఫ్లెక్సీని తొలగింపచేశారు ఇకపై ఇలాంటి పరిస్థితి పునరావృతం కాదని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

మందకృష్ణ పర్యటనకు తరలిరండి

గోరంట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న మందక్రిష్ణ మాదిగ అనంతపురం వస్తుండడతో ఉమ్మడి జిల్లాల మాదిగలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంఆర్‌ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుసూధన్ పిలుపునిచ్చారు. గోరంట్లలో ఎంఆర్‌ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతపురంలో మందక్రిష్ణ మాదిగతో ఆత్మీయ కలయిక, మహాసభ, విజయోత్సవ ర్యాలీ జరుగుతుందన్నారు. ఈకార్యక్రమం జయప్రదం చేయడానికి కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



రొద్దంలో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని రొద్దంలో గురువారం నుంచిగ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రొద్దంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ నెల 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు 19న మహిళా సాధికారత కోసం అవగాహన సదస్సు, 20న వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులుఅందజేస్తున్నట్లు గ్రంథాల అధికారి నాగరాజు తెలిపారు.

టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాడిశెట్టి



కాడిశెట్టి కృష్ణారెడ్డి

పెనుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పెనుకొండకు చెందిన ఉపాధ్యాయుడు కాడిశెట్టి శ్రీనివాసులు ఎంపికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో అధ్యక్షులుగా కాడిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా పెనుకొండకు చెందిన కృష్ణారెడ్డి ఎంపికయ్యారు. వీరి ఎన్నికపట్ల పెనుకొండ డివిజన్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కిష్టప్ప, నాగశేఖర్, విజయ్‌కుమార్ నాయక్, బి.శ్రీనివాసులు, తదితరులు అభినందనలు తెలిపారు.

నేడు మైదుగోళం చేపల చెరువు వేలం

లేపాక్షి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మైదుగోళం చెరువులో చేపలు పెంచేందుకు గురువారం గ్రామ సచివాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపలు పెంచేందుకు వేలంపాట నిర్వహిస్తున్నామని ఆసక్తిగలవారు ధరావతు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. గురువారం ఉదయం 11గంటలకు వేలంపాట ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

చెట్లు.. ప్రగతికి మెట్లు

హిందూపురం అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చెట్లు ప్రగతికి మెట్లు అని దీప్తి పాఠశాల ప్రిన్సిపాల్ అబ్రహం కుట్టి అంకుల్ పేర్కొన్నారు. పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ కేడెట్లకు మొక్కల పెంపకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి, డాక్యుమెంటరీ సినిమాను చూపించారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షించుకొంటే అవి చెట్లుగా పెరిగి జీవన శైలికి ఎంతగానో తోడ్పడుతాయని విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి మొక్కలను పెంచాలని సూచించారు. విద్యార్థి స్థాయి నుంచే దేశ భక్తి అలవరుచుకోవాలని తెలిపారు.

గైనిక్ వార్డులో గందరగోళం



- ● ఇదీ పురం ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితి
- ● అందుబాటులో లేని వైద్యులు
- ● ఆసుపత్రికి రావాలంటేనే జంకుతున్న గర్భిణులు

నలుగురిలో ముగ్గురు వైద్యుల సెలవు

హిందూపురం అర్బన్, నవంబరు 13: ఉమ్మడి జిల్లాలో అనంతపురం ఆసుపత్రి తరువాత హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రే పెద్దది. 250 బెడ్లతో ఉండే ఈ ఆసుపత్రికి పురం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాలైన పరిగి, చిలమత్తూరు, లేపాక్షితో పాటు గోరంట్ల, సోమందేపల్లి, పెనుకొండ రొద్దం, మడకశిర, నుంచి కూడా వైద్యం కోసం వస్తుంటారు. ఒకప్పుడు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి సేవలకు అవార్డులు వచ్చాయి. అప్పట్లో అంతబాగా సేవలందించినా, ప్రస్తుతం ఇక్కడ కొంత మంది వైద్యుల తీరు రోగులకు ఇబ్బందికరంగా తయారైంది. కొంతమంది ఇక్కడ ఛార్జి తీసుకొని వారానికి ఒకటి రెండుసార్లు మాత్రమే వస్తున్నారు. ఇటీవలకాలంలో అత్యంత బాధ్యాతాయుతమైన కాన్పులవార్డులో వైద్యులతీరు మరీ అధ్వాన్నంగా తయారైంది.

గైనిక్ వార్డులో నలుగురు వైద్యులు ఉండగా, అందులో ఒక వైద్యురాలు మెటర్నిటీ సెలవుపై వెళ్లారు. మరో వైద్యురాలు నెల రోజులపాటు సెలవులో వెళ్లారు. నెలరోజులు సెలవు పూర్తి అయినా ఆమె ఇంకా విధుల్లో చేరలేదని తెలుస్తోంది. బుధవారం మరో వైద్యురాలు విధులకు రావాల్సి ఉంది. అయితే ఆమె కూడా మెడికల్ సెలవులో వెళ్ళినట్లు సూపరింటెండెంట్ లింగణ్ణ తెలిపారు. ఇక మిగిలిన ఒకే ఒక్క వైద్యుడు మంగళవారం విధులు ముగించుకొని వెళ్లాడు. దీంతో బుధవారం గైనిక్ వార్డులో ఒక్క వైద్యుడు కూడా లేకుండా పోయారు. పరిస్థితిని గమనించిన సూపరింటెండెంట్ ఎంబిబిఎస్ వైద్యులను సర్దుబాటు చేసి ఓపి వరకు నిర్వహించారు. గర్భవతులను పరిశీలించి మందులు అయితే రాసిచ్చారు. అదే సిజేరియన్ చేయాల్సి వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుతం గైనిక్ ఓపికి దాదాపుగా 70 నుంచి వంద మంది వస్తున్నారు. ప్రతి రోజు కనీసం 2 నుంచి 4 సిజేరియన్ కేసులు వస్తుంటాయి. ఇవే కాకుండా నార్మల్ కేసులు కనీసం ఐదారు ఉంటాయి. ఇవి కాక రక్తహీనతతో ఉన్న వారు రక్తం ఎక్కించుకునేందుకు వస్తుంటారు. ఇలాంటి కేసులన్నీ గైనిక్ డాక్టర్లే పరిశీలించాలి. ఆపరేషన్‌లు చేయాలి. అయితే బుధవారం ఒక్క వైద్యుడు కూడా అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు నిరీక్షించి నీరసించి వెనుతిరిగి పోయారు.

- సెలవుపై వెళ్లి సొంత క్లినిక్‌లలో డ్యూటీ

ఎవరికైనా ఆరోగ్యం బాగలేకపోతే మెడికల్ సెలవులు పెట్టుకొని వెళతారు. అది వారి హక్కు. అయితే కొందరు వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు చేయకుండా సెలవు పెట్టి మరీ వారి సొంత క్లినిక్‌లలో డ్యూటీ చేస్తున్నారని ఆసుపత్రి వర్గాలవారు అంటున్నారు. ఇక్కడ అయితే ఆరోగ్యం సహకరించలేకపోవడంతో సెలవు పెట్టారు. మరి బయట వారి సొంత క్లినిక్‌లలో అయితే సహకరిస్తుందా? అని ప్రశ్నిస్తున్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులుగా వచ్చిన కొన్ని సంవత్సరాలకే సొంత భవనాలు నిర్మించి క్లినిక్‌లు కట్టుకొని ఆసుపత్రికి వచ్చే రోగులను సొంత క్లినిక్‌లకు మళ్లించుకొని వ్యాపారం చేస్తున్నారు.

- మంత్రి సొంత జిల్లాలోనే ఇలా...

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా ఆసుపత్రిలోనే ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు అవార్డుల పంట పండించిన ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి నేడు దయనీయ పరిస్థితిలో ఉంది.

పరిస్థితి డీసీహెచ్‌కు తెలిపా..

ప్రస్తుతం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న పరిస్థితి గురించి డీసీహెచ్‌కు తెలిపాము. ప్రస్తుతం ఎంబిబిఎస్ వైద్యుల సహకారంతో ఓపి నిర్వహిస్తున్నాము. గురువారం నుంచి ఒక వైద్యుడు అందుబాటులో ఉంటారు.

- డాక్టర్ లింగణ్ణ, సూపరింటెండెంట్

ఉద్యోగం పేరుతో బురిడీ

పరిగి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):తాడిపత్రికి చెందిన ప్రసాద్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం కోసం నగదు తీసుకుని మోసం చేశాడంటూ బాధితులు అతడిపై పరిగి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ రంగడు యాదవ్ మాట్లాడుతూ, ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న సాయిక్రిష్ణ రూ.2.5లక్షలు, విజయ్ రూ.50వేలు, సాకెత్ రూ.లక్ష, నవీన్ రూ.1.60లక్షలు, అఫ్రోజ్ రూ.2.60లక్షలు మొత్తం రూ.8.60లక్షలు ప్రసాద్ అనే వ్యక్తికి ఇచ్చి మోసపోయామంటూ స్టేషన్‌లోఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై ప్రసాద్‌ను ప్రశ్నించగా తమ పై అధికారులు పెద్దిరెడ్డిపల్లికి చెందిన రాజేశ్వరి, ఒంగోలు వాసి మారుతి ప్రసాద్, వారు చెప్పినందుకుగాను నగదు తీసుకున్నానంటూ వాపోయారు. ప్రసాద్, మారుతిప్రసాద్, రాజేశ్వరిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా గౌడసంద్ర దేవత గ్రామోత్సవం



అమ్మవారి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న గొర్రెలు

మడకశిర రూరల్, నవంబరు 13 :(ఆంధ్రజ్యోతి) మండలంలోని కదిరేపల్లిలో వెలసిన గౌడసంద్రమార్మదేవత గ్రామోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు.గ్రామస్థులు అందరూ కలసి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పొలిమేరలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గొర్రెలకాపర్లు అమ్మవారి చూట్టూ ప్రదక్షిణలు చేయించారు

ఒంటరి మహిళలకు ఆర్డీటీ ద్వారా సరుకులు

రొళ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆర్డీటీ కార్యాలయంలో 43మంది ఒంటరి మహిళలకు ఉచిత సరుకులను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి బియ్యం 12కిలోలు, రాగి, దాల్ , గోధుమలు పంపిణీ చేసినట్లు ఏటీఎల్ ఓబుళేషు తెలిపారు.

మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలి



మాట్లాడుతున్న సీఐటీయూ, అంగన్‌వాడీ నాయకులు

పెనుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్ వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ జీవో ఇవ్వాలని కోరుతూ ఈనెల 16న కలెక్టరేట్‌వద్ద నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయు నాయకులు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో బుధవారం జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8637సెంటర్లలో మినీ వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. మొదట్లో మినీ వర్కర్లకు, లబ్దిదారులకు ఆహారం అందిస్తే చాలని నియమించారని, నేడు మెయిన్ అంగనవాడీ సెంటర్లలో వర్కర్లు, హెల్పర్లు చేసే పనులను మినీ వర్కర్లచేత చేయిస్తున్నారన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని గత మూడేళ్లగా పోరాటాలు చేస్తున్నామన్నారు. సర్వేలు చేయించి మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మారుస్తామని అధికారులు హామీ ఇచ్చారుకానీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేసి జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ బాబావలి, అంగనవాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బావమ్మ, సెక్టర్‌లీడర్‌లు సావిత్రమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి భరించలేం

● ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో స్టాఫ్‌నర్సుల ఆవేదన



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న నర్సులు

హిందూపురం అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో తమపై పనిఒత్తిడి అధికమైందని స్టాఫ్‌నర్సులు హిందూపురం ప్రభుత్వ సూపరింటెండెంట్ లింగణ్ణతో మొరపెట్టుకున్నారు. బుధవారం ఆయనను చాంబర్‌లో కలిసిన నర్సులు మాట్లాడుతూ, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో దాదాపు 40 మంది స్టాఫ్ నర్సులు ఉండాలన్నారు. అయితే ఇటీవల ఏఎన్ఎంలకు ప్రమోషన్‌లు ఇచ్చి వారిని ట్రైనింగ్‌కు పంపారన్నారు. దీంతో 11 మంది సిబ్బంది తగ్గారన్నారు. మొదట్లో మూడు నెలలకు ఒక మారు నైట్ డ్యూటీ వచ్చేదని, నెలంతా నైట్ డ్యూటీలు చేసేవారమన్నారు. తరువాత మూడు నెలల వరకు నైట్ డ్యూటీలు ఉండేవి కావని ఇప్పుడు సిబ్బంది తగ్గడంతో నెల రోజులు నైట్ డ్యూటీ చేస్తే ఒక నెల తరువాత మరలా నైట్ డ్యూటీలు వేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న 29 మందే 7 విభాగాల్లో ఇద్దరు, ముగ్గురు సర్దుకుని పని చేస్తున్నామని తెలిపారు. పిల్లల వార్డులో అయితే దాదాపు వంద మంది పిల్లలకు ఒక్కరే ఇన్‌జక్షన్ వేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు.. ఉన్నతాధికారులకు తమ పరిస్థితిని తెలియజేసి ఇతర ప్రాంతాల నుంచి స్టాఫ్‌ను సర్దుబాటు చేయాలని కోరారు. సూపరింటెండెంట్ ఇప్పటికే ఈ విషయం డిసిహెచ్‌కు తెలిపామన్నారు.

హంద్రీ నీవాకు రూ.822 కోట్లు కేటాయించడంపై హర్షం

మడకశిర, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఈ ఏడాది బడ్జెట్లో రూ.822 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. కరువు జిల్లా రైతాంగం తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ 2023-24 బడ్జెట్ లో హంద్రీనీవా పనులకు జగన్ ప్రభుత్వం కేవలం రూ.122 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. 2019 -24 లో జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. 1983లో స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా హంద్రీనీవా ప్రాజెక్టు కు శ్రీకారం చుడితే జగన్ 2019 లో అధికారంలోకి వచ్చాక హంద్రీనీవా కు సంబంధించి 31 పనులను రద్దుచేసి ఉమ్మడి అనంతపురం జిల్లాకు తీరని అన్యాయం చేశారన్నారు. ప్రధాన కాలువ వెడల్పు చేసి, కాంక్రీట్ లైనింగ్ వేసి డిస్ట్రిబ్యూటరీలను నిర్మిస్తే ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

వెంకటగిరి పాళ్యంలో రోడ్లపైనే మురుగునీరు

- డ్రైనేజీ ఏర్పాటు చేయాలని గ్రామస్థుల మొర



రోడ్లపై మురుగునీరు

పెనుకొండ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గత కొంతకాలంగా గ్రామంలో డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లముందు పోసే నీరంతా రోడ్లపైకే వస్తోందని మండలంలోని వెంకటగిరిపాళ్యం వాసులు అంటున్నారు. రాత్రిపూట దోమలకాటుతో రోగాలబారిన పడుతున్నామని డ్రైనేజీ నిర్మాణం చేయాలని మొరపెట్టుకుంటున్నారు. రోడ్లపై మురుగునీరు నిలువ ఉండటంతో దోమలు వృద్ధిచెంది అవి కుట్టడంతో రోగాలబారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, స్పందించి డ్రైనేజీ ఏర్పాటుచేసి రోడ్లపై మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఘనంగా తులసాంబదేవి రథోత్సవం



పురవీధుల్లో సాగుతున్న రథోత్సవం

లేపాక్షి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోపిదేవరపల్లి గ్రామంలో వెలసిన తులసాంబదేవి బ్రహ్మారథోత్సవ వేడుకలను బుధవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. తులసాంబాదేవి విగ్రహాన్ని బుధవారం ప్రత్యేకంగా అలంకరించి తొలుత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవ వేడుకలకు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

మద్యం అక్రమ రవాణాదారులపై కొరడా



స్వాధీనం చేసుకున్న మద్యంతో సీఐ

హిందూపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా రవాణాచేసే వారిపై ఎక్సైజ్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. గత ఐదేళ్లుగా కర్నాటక నుంచి విచ్చలవిడిగా మద్యం అక్రమంగా తీసుకొచ్చి విక్రయించిన వారిని గుర్తించి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీఐ లక్ష్మీదుర్గయ్య ఘాటుగా కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరైనా కర్నాటక నుంచి మద్యం తీసుకొస్తే పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కర్నాటక నుంచి ఒక్కమద్యం ప్యాకెట్‌కూడా ఇక్కడికి రావడానికి వీలులేదన్నారు. అంతేకాక తహసీల్దార్ ముందు హాజరుపరిచి రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేస్తామన్నారు. దానిని ఎవరైనా అతిక్రమించి మద్యం తీసుకొస్తే రూ.లక్ష జరిమానాతోపాటు కేసు నమోదు చేస్తామన్నారు. స్టేషన్ పరిధిలో 30మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

- కర్ణాటక మద్యం పట్టివేత

కర్నాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తుండగా హంద్రీనీవా కాలువ వద్ద గొంగటిపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా హిందూపురం మండలం కొటిపికి చెందిన రామకిష్టప్ప కర్నాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టేచేసి మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫారూక్, రవీంద్రకుమార్‌లు పాల్గొన్నారు.

కురుబవాండ్లపల్లిలో కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

పెనుకొండ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని కురుబవాండ్లపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు కొనసాగుతోంది. బీసీ సంక్షేమం చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ సోమశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఒక్కరోజే గ్రామంలో 250మందికి సభ్యత్వ నమోదు చేయించారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే టీడీపీ సభ్యత్వ నమోదుతో బాధితులకు కూటమి ప్రభుత్వం రూ.5లక్షలు బీమా సౌకర్యం కల్పించిందన్నారు. దీంతో ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

రేపు శనేశ్వర సన్నిధిలో కృత్తికోత్సవం



కార్తీక పున్నమికి ముస్తాబైన సీతలాంబాదేవి

పావగడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చరిత్రప్రసిద్ధిగాంచిన పావగడ శనేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పున్నమి కృత్తికోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ డైరెక్టర్, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రాత్రి 7గంటలకు శనైశ్చరస్వామి ఉత్సవం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం అభిషేకం, అర్చన, అలంకారం, మధ్యాహ్నం మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరగనుందన్నారు. లక్షదీపోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకొంటే సకల పాపాలు వైదొలుగుతాయని ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి తెలియజేశారు.

పావగడలో వేరుశనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

పావగడ, నవంబరు13(ఆంధ్రజ్యోతి): పావగడ ఆర్‌ఎంసీ మార్కెట్‌యార్డులో 2024-2025 సంవత్సరానికిగాను మద్దతు ధర పథకం కింద ఎఫ్ఏక్యూ రకం వేరుశనగను కొనుగోలు చేసేందుకు వేరుశనగ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఆర్‌ఎంసీ కార్యదర్శి హనుమేష్ తెలియజేశారు. ప్రతి రైతు నుంచి ఎకరాకు మూడు క్వింటాళ్ల నుండి 15 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తామన్నారు. క్వింటాలుకు రూ.6783 ధర నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు గడువును 45 రోజుల నుండి 90 రోజుల వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.

16న మెగా జాబ్‌మేళా

హిందూపురం,నవంబరు 13(ఆంధ్రజ్యోతి):హిందూపురం పట్టణంలోని బాలాజీ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప తెలిపారు. సుమారు 50 ప్రముఖ కంపెనీలవారు దాదాపు 15వేల ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఉదయం 9గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

పోస్టల్ శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలు

మడకశిరటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసు ద్వారా పలు ప్రభుత్వ పథకాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆధార్ లింక్‌తోపాటు ఇతరత్రా సర్వీసులను సైతం అందించేందుకు పోస్టాఫీసులు ముందుకు వచ్చినట్లు హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం అవగాహన కార్యక్రమాన్ని మడకశిర పోస్టాఫీసులో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక, జిల్లా యంత్రాంగం సహకారంతో గ్రామ వార్డు సచివాలయ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కొత్తగా ఐపీపీబీ బ్యాంకు ఖాతాలను తెరుస్తున్నామని, ఈఖాతా ద్వారా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్ సులభతరం అవుతుందన్నారు. ఈనెల 15వతేదీ వరకు పోస్టల్ ఖాతా తెరిచేందుకు సమయం ఉన్నట్లు తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

గుడిబండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రైతు సదస్సులను నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కల్యాణచక్రవర్తి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జంబలబండ గ్రామంలో రెవిన్యూ సదస్సులను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నో ఏళ్ల నుండి భూ సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాటి పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. రైతుల భూములకు సంబంధించిన వన్‌బీ, పాసుపుస్తకం ఇస్తామని వివరించారు. రెవిన్యూ సదస్సులో మూడు దరఖాస్తులు వచ్చాయి.

అమరాపురంలో

అమరాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పీటీఆర్ఎస్ గ్రామ సభలో ప్రజల నుండి ఎలాంటి భూ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సీనియర్ అసిస్టెంట్ రజిత్‌కుమారి కోరారు.

అభివృద్ధి పై సర్పంచులకు శిక్షణ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 2025-2026 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి అధికారులకు, సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వెలుగు సీసీలకు గాయాలు

గోరంట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బూదిలి వద్ద జరిగిన ప్రమాదంలో బూదిలి వెలుగు సీసీలు శ్రీరామ్‌నాయక్, రాధమ్మలు బుధవారం తీవ్రంగా గాయపడ్డారు. బూదిలిగ్రామంలో వికల సమావేశం ముగిసిన తరువాత సీసీలు శ్రీరామ్‌నాయక్, రాధమ్మలు ద్విచక్రవాహనంలో కాగానిపల్లికి వెళ్తుండగా గొల్లపల్లి కూడలిలో ఈ ప్రమాదం జరిగింది. బూదిలినుంచి కదిరి వైపు వెళ్తున్న లారీ ట్రాక్టర్‌కు దారి వదిలే సమయంలో వెనుకనుంచి ద్విచక్రహనాన్ని ఢీకొంది. ఇరువురికి ఎడమ చేతులు విరిగి తీవ్రంగా గాయపడగా, గోరంట్ల ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కు హిందూపురం తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే వెలుగు ఏపీఎంలు నాగమణి, నారాయణ, సీపీలు గోరంట్ల ఆసుపత్రికెళ్లి పరామర్శించారు.